క్లుప్తంగా

ఏకగ్రీవంగా ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ ఎన్నిక



ఎన్నికైన సభ్యులను సన్మానించిన దృశ్యం

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో ఆదివారం నిర్వహించిన ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివన్న, ఉపాధ్యక్షుడిగా అమాలి వెంకటేష్, సెక్రటరీగా రహంతుల్లా, జాయింట్ సెక్రటరీగా గోవింద్, ట్రెజరర్‌గా మస్తాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా వారిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

మహిళల ఆత్మగౌరవం కాపాడతాం



మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: మహిళల ఆత్మగౌరవం కాపాడుదామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పిలుపునిచ్చారు. ఆదోని పట్టణంలోని అమరావతినగర్‌లో మరుగుదొడ్ల నిర్మాణం కోసం జరిగిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఇంకా పట్టణంలో ఆరు చట్ల ఇలాంటి మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఉరుకుంద ఆలయానికి వీల్ చైర్ విరాళం



వీల్ చైర్‌ను అందజేస్తున్న దాత ఎల్లప్పరావు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో స్వామి దర్శనార్థం వచ్చే వికలాంగుల కోసం రాయచూర్‌కు చెందిన ఎల్లప్పరావు వీల్ చైర్‌ను విరాళంగా అందజేశారు. దాతకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫొటో అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు కోరారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కిరణ్, కుమార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సాయం

ఆదోని టౌన్: పట్టణంలోని రాయనగర్‌లోని రాయ మిల్స్ కార్మికుడు పెద్ద ఈరన్న(62) గుండెపోటుకు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.5 వేలను వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా అందించారు. బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాయనగర్ ఈరన్న, సీనియర్ నాయకులు రూబెన్, హనుమంతు, తిక్కన్న, ఆటోరాజు పాల్గొన్నారు.

అత్యాచారానికి పాల్పడిన ఆటో డ్రైవర్‌ను శిక్షించాలి



ఎమ్మిగనూరు సర్కిల్‌లో ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: ఆదోనిలో విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఆటో డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, ఏఐఎస్‌ఎఫ్ మండల కోశాధికారి శేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మిగనూరు సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత శనివారం రోజున ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న మైనర్ విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ముందుముందు ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసుశాఖ గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షులు మల్లికార్జున, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శివ, మహిళా విద్యార్థినులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతి

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎమ్మెల్యే పార్థసారథి క్యాంపు కార్యాలయంలో ఆదివారం డాక్టర్ శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆదోనిలో పీర్ల దేవుళ్లను గ్రామపురవీధులగుండా ఊరేగింపు,



కౌతాళంలో హసేన్, హుసేన్ పీర్ల ఊరేగింపు



కౌతాళంలో సాల్ పంజాల (పీర్లు) ఊరేగింపు



గోనెగండ్లలో పీర్ల దేవుళ్లను ఊరేగింపు చేస్తున్న దృశ్యం

త్యాగానికి ప్రతీక మొహర్రం

- పదో రోజు పీర్ల దఫన్ కార్యక్రమంతో ముగిసిన మొహర్రం వేడుకలు
- ముస్లింల ఉపవాస దీక్షలు
- చావిడీలు, మసీదుల వద్ద షర్బత్ పంపిణీ

కౌతాళం: గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా పదవ రోజు దఫన్ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 8గంటల వరకు జరిగింది. హసన్, హుసేన్ త్యాగ నిరతికి ప్రతికగా జరుపుకునే మొహర్రం వేడుకల్లో పదవ రోజుకు ప్రత్యేక స్థానం ఉంది. ఈరోజు చాల మంది ఉపవాస దీక్షలు చేపట్టారు. కొంత మంది పీర్ల చావిడీల వద్ద, రచ్చబండల వద్ద మసీదుల వద్ద షర్బత్‌లను పంపిణీ చేశారు. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండలంలోని బదినేహల్, కామవరం గ్రామాల్లో మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి. కౌతాళంలో ముందుగా జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు అన్ని పీర్లు చేరిన తర్వాత దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా ఆధ్వర్యంలో ఊరేగింపు ప్రారంభించారు. రాత్రి కర్బలా మైదానంలో పీర్లను దఫన్ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోసిగి: మండల పరిధిలోని చింతకుంట, పల్లెపాడు గ్రామాల్లో మొహర్రం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం సాయంత్రం డప్పువాయిద్యాలతో పీర్లను ఊరేగింపు గా గ్రామంలో పుర వీధుల గుండా ఊరేగించి దఫన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో యువకులు, పెద్దలు తప్పెట మధ్య ఆలాయి బలాయి కార్యక్రమం మధ్య ఊరేగింపు నిర్వహించారు.

మంత్రాలయం రూరల్ : మంత్రాలయం, కల్లుదేవకుంట గ్రామంలో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. మంత్రాలయంలో కొలువుతీరిన హజరత్ ఇమామ్ కాశీమ్, హజరత్ హుసేన్, ఉసేన్‌ల పీర్ల ఆదివారం సాయంత్రం మేళతాళాలు, డప్పువాయిద్యాలతో భారీ జన సందోహం మధ్య ఊరేగింపు నిర్వహించారు. తుంగభద్ర నది వరకు ఊరేగింపుగా వెళ్లి దఫన్ కార్యక్రమం చేపట్టారు. అలాగే కల్లుదేవకుంటలో దఫన్ కార్యక్రమం చేపట్టారు.

కులమతాలకు అతీతంగా మొహర్రం

ఆదోని అర్బన్: కులమతాలకు అతీతంగా మొహర్రం వేడుకలను అన్నివర్గాల వారు జరుపుకోవడం సంతోషంగా ఉందని ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు. పట్టణశివారులోని రణమండ కొండ సమీపంలో కొలువుదీరిన పీర్లదేవుళ్ల ఆదివారం యేటికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగిసిన మొహర్రం వేడుకలు

ఆదోనిరూరల్: మండలంలోని కపటి, సంతెకూడ్లూరు, సాదాపురం, విరుపాపురం, గణేకల్, ఇస్వీ తదితర గ్రామాల్లో పీర్ల దేవుళ్లను గ్రామపురవీధుల గుండా ఊరేగించారు. అలాగే కొందరు భక్తులు ఎలుగుబంటి, పులి వేషాలు, ఆడ వేషాలు వేసి మొక్కులను తీర్చుకున్నారు. ఆదివారం సాయంత్రం పీర్ల దేవుళ్లను ఏటికి పంపి వేడుకలను ముగించారు.

నందవరం : మండల పరిధిలోని నాగలదిన్నె, ముగతి, నదికైరవాడి, మాచాపురం, కనకవీడు, సోమలగూడూరు, పెద్దకొత్తిలి తదిరత గ్రామాల్లో వెండి గొడుగులు, పూలతో అలంకరించి పీర్లను తెల్లవారు జామున మేళతాళలు, తప్పెట్లతో ఊరేగింపుగా ఏటికి తరలించారు. పీర్ల ఊరేగింపు ముందు దువాతో వీరుల త్యాగనిరతిని స్మరించుకున్నారు. ఆయా గ్రామాల్లో ఆదివారం పీర్ల జలధివాసం ప్రశాంతంగా ముగిసింది.

మత సామరస్యానికి ప్రతీక

గోనెగండ్ల : మొహర్రం పండుగ వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. మండల కేంద్రం గోనెగండ్లతో పాటు ఐరన్‌బండ తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పెద్ద సరిగెత్తులో భాగంగా పీర్లను ఊరెగింపు చేసి చావిళ్లకు చేర్చారు. సాయంత్రం సంత మార్కెట్‌లో ప్రజలు పాల్గొని పీర్ల దేవుళ్లను ఏటికి సాగనంపారు. పలువురు వివిధ వేషధారణలలో ప్రజలను ఆకట్టుకున్నారు.



ఆదోనిలో పీర్లదేవుళ్లను ఏటికి తరలిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల కేంద్రంతో పాటు పీకలబెట్ట, హెచ్.మురవణి, కల్లుకుంట, మేకడోణ, కంబలదిన్ని, చిన్నతుంబళం తదితర గ్రామాలలో ఈ వేడుకలు కుల మతాలకు అతీతంగా భక్తితో జరుపుకున్నారు. మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామంలో తిక్కతాత పీర్లును ఎత్తే జుబేరుతాత తెల్లవారిజామున 3గంటల సమయంలో ఇంటి నుంచి ఊరేగింపుగా పీర్ల చావిడి వద్దకు చేరుకున్నారు. వందలాది భక్తుల నడుమ అగ్ని గుండంలోని ఎర్రటి నిప్పులపై దుప్పటి వేసుకొని కూర్చొని రెట్టెలను కాల్చి ప్రజలను భక్తిభావనలో ముంచితేల్చారు. మండల కేంద్రంలోని ఖాదరవలీ పీర్లు, గుమ్మటయ్య పీర్లును తెల్లవారి జామున గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం పీర్ల చావిడీ వద్దకు వచ్చిన తరువాత ఆనవాయితీలో భాగంగా భవిష్యవాణి వినిపించి అగ్నిగుండంలో మూడుసార్లు నడిచారు. సాయంత్రం పీర్ల ఊరేగింపు కార్యక్రమం మొదలయ్యింది. రాత్రి 8గంటలకు స్థానిక పెద్దబావి దగ్గరకు చేరుకొని పీర్ల జలధి గావించారు.



పీకలబెట్టలో అగ్నిగుండంలో కూర్చొని రెట్టెలు కాల్చుతున్న జుబేరుతాత



మంత్రాలయంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



చింతకుంటలో పీర్ల దేవుళ్ల ఊరేగింపు



నదికైరవాడిలో పీర్లను ఏటికి తీసుకెళ్తున్న భక్తులు



గోనెగండ్లలో విచిత్ర వేషధారణ

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుల హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్, అకాడమిక్ కమిటీ మెంబర్ బి.మహాదేవప్ప అన్నారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు పీఆర్‌సీ, డీఏ బకాయిలు చెల్లించకుండా జాప్యం చేస్తుందన్నారు. ఐచ్ఛిక సెలవులపై ప్రభుత్వం, అధికారులు నిరంకుశ వైఖరి అవలంబిచారన్నారు. వెంటనే 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలోఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.సి.సుంకన్న, ఎస్టీయూ ఆదోని మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్‌బాబు, ఎస్టీయూ జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజనేయులు, సీనియర్ నాయకులు ఎస్‌ఎస్ భాస్కర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ, ప్రభుత్వ రంగ సంస్థల, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 9వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాలు కలిసిరావాలని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు కేసీ జబ్బార్, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ యాదవ్, మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సంపూర్ణమద్దతు

ఈనెల 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు భారత కార్మిక సంఘాల సమాఖ్య, రైతు కూలీ సంఘాలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆయా సంఘాల నాయకులు కె.ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు నరసన్న, అనీఫ్‌లు ఆదివారం తెలిపారు.

మంత్రాలయం రూరల్: లేబర్ కోడ్స్ రద్దుపై ఈ నెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం మంత్రాలయం మండల కేంద్రంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆంధ్రయ్య, రైతు సంఘం నాయకులు లక్ష్మన్న, తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: ఈనెల 9న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పి.ఎస్.గోపాల్, సహాయ కార్యదర్శి లక్ష్మన్న పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

ఆదోని అర్బన్: పట్టణంలోని తిరుమలనగర్‌లోని ఫెయిత్ హోంలో డాక్టర్ బిషప్ డేనియల్ ప్రేమసాగర్ ఆధ్వర్యంలో చైతన్య కళాభారతి స్వచ్ఛంద సంస్థ నంద్యాల వారు ఆదివారం డివిజన్‌లో ఉన్న హెచ్ఐవీ పాజిటివ్ విద్యార్థులకు నోట్‌బుక్స్, జామెంట్రీ బాక్స్, ఎగ్జామ్స్ ప్యాడ్, స్కూల్ బ్యాగు, స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో చైతన్య కళాభారతి అధ్యక్షుడు వాసగిరి విజయభాస్కర్, సంస్థ సభ్యురాలు వరలక్ష్మి, జిల్లా హెచ్ఐవీ పాజిటివ్ నెట్‌వర్క్ నేస్తం సభ్యురాలు మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

ఎమ్మిగనూరురూరల్: రైతులకు పంపిణీ చేసేందుకు డీసీఎంఎస్‌లో 1,160 బస్తాల యూరియా సిద్ధంగా ఉందని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, మండల వ్యవసాయాధికారి శివశంకర్‌లు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ రైతులు యూరియా కొరత ఉంటుందని ఆందోళన చెందవద్దన్నారు. డీసీఎంఎస్‌కు 1,160 బస్తాల యూరియా స్టాక్ వచ్చిందని, పంపిణీకి సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

ఆదోని రూరల్: ఆదోని మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని డీసీఎంఎస్ గోదాములో 15 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు. ప్రైవేట్ డీలర్ల వద్ద 620 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబుజగ్జీవన్ రామ్



బాబుజగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక



మంత్రాలయంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: అణగారిన వర్గాల అభ్యున్నతికై జీవితాంతం కృషి చేసిన మహనీయుడుభారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక అన్నారు. ఆదివారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో బాబుజగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ, పార్టీ శ్రేణులతో కలిసి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, నాయకులు పాలశ్రీనివాస రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, ముస్లిం మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షుడు మహబుబ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని సోమప్ప సర్కిల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఖాశింవలి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ తదితరులు బాబుజగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి

నందవరం : బలహీపవర్గాల అభ్యున్నతికి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జీవితం అంకితం చేశారని డిప్యూటీ తహసీల్దార్ శశిశేఖర్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ 39వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- మంత్రాలయం రూరల్ : బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని మంత్రాలయం మండల కేంద్రంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర వ్యవస్థాప అధ్యక్షులు చిక్కం జానయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, నాయకులు మాదిగ రత్నం, సంఘటి యోహాన్ పాల్గొన్నారు.
- కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.





ఆదోని నల్లకొండ శ్రీ రుక్మిణీ పాండురంగ స్వామివార్లకు మంగళహారతి ఇస్తున్న అర్చకుడు, పాండురంగస్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలిచి ఉన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- మారుమోగిన హరినామ స్మరణ

ఆదోని అర్బన్: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం పట్టణంలోని రుక్మిణీ పాండురంగస్వాముల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. జైజై రామకృష్ణ హరి జైజై పాండురంగ హరి అని నామస్మరణతో పట్టణంలోని పాండురంగస్వామి ఆలయాలు మారుమోగాయి. పట్టణ శివారు ఇస్వీ రోడ్డులో వెలిసిన శ్రీ నల్లకొండ పాండురంగస్వామి ఆలయంలో ఆలయ నిర్వాహకుడు అశ్వత్ నారాయణ ఆధ్వర్యంలో అర్చకులు సముద్రాల పవన్, అశ్వంత్‌లు వేకువజామున 4 గంటల సమయంలో రుక్మిణి పాండురంగస్వాములకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, తులసీమాల, వెండి అలంకరణ, తామరపూల మాల, నైవేద్యం, మహామంగలహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. మధ్యాహ్నం పల్లకీసేవ, సాయంత్రం రుక్మిణి పాండురంగస్వాముల విగ్రహాలతో ఆలయం ఆవరణలో రథోత్సవం జరిగింది. పట్టణంలోని విక్టోరియాపేటలో వెలిసిన శ్రీ రుక్మిణీ పాండురంగ విట్టల స్వామి వార్ల పల్లకీ ఉత్సవం ఘనంగా జరిగింది.

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లతో పాటు హెచ్. కైరవాడి, పెద్దనేలటూర్, అలువాల, కులుమాల, వేముగోడు తదితర గ్రామాల్లో ఆదివారం తొలిఏకాదశి(ఆషాడశుద్ధ ఏకాదశి) వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తైన వైష్ణవ దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా గోనెగండ్లలో శ్రీశ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం దేవాలయాలకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించారు.



రథోత్సవానికి సిద్ధమైన ఉత్సవమూర్తులు



విక్టోరియాపేట పాండురంగడికి పల్లకీసేవ

నందవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో క్షేత్రపాలకుడు శ్రీవేద నారాయణ స్వామికి ఆషాఢమాస తొలి ఏకదాశి ప్రత్యేక పూజలు పురోహితులు, భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు హంపేష్ స్వామి ఆధ్వర్యంలో నారాయణ స్వామికి, ఆది దంపతులు(రామలింగేశ్వర స్వామి, పార్వతీ దేవి)లకు జలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు గావించారు. భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి నారాయణ స్వామిని, ఆదిదంపతులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసదాలు వితరణ చేశారు.



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దళితుడిపై దాడి అమానుషం

పెద్దకడబూరు : మండల పరిధిలోని హెచ్.మురవణిలో ఆదివారం సాయంత్రం పీర్ల ఊరేగింపు చూసేందుకు వెళ్లిన సిందాల వెంకటరాముడుపై అగ్ర కులానికి చెందిన వీరేష్, లసుముడు దాడి చేయడం అమానుషమని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, జైభీమ్ ఎమ్మార్పీఎస్ మంచోది ఆదాము అన్నారు. దాడిలో గాయపడిన ఆయన పెద్దకడబూరులోని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి అనంతరం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కులమతాలకు అతీతంగా జరుపుకునే వేడుకల్లో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు.

బుట్టా రేణుకకు కులసంఘాల సన్మానం



వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుకను సన్మానిస్తున్న కుల సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికలో రోడ్డు వేసేందుకు గతంలో చేసిన మున్సిపల్ తీర్మానాన్ని రద్దు చేసేందుకు సహకరించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ నాయకుడు బుట్టా శివనీలకంఠలను ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో 22 బీసీ కులసంఘాల నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లచే గతంలో చేసిన తీర్మానాన్ని రద్దు చేసేందుకు కృషి చేసి, కబ్జాకు గురైన స్థలాన్ని శ్మశాన వాటికకు చెందేలా చేయడంపై ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా కులసంఘాల నాయకులు వీజీఆర్ కొండయ్య, కామర్తి నాగేషప్ప, కోటకొండ నరసింహులు, మాధవస్వామి, యాపీలయ్య, బజారి, కామ్లే గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మొక్కల పంపిణీ

నందవరం: రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకంలో భాగంగా అధికారులు రైతులకు కొబ్బరి, జామ, సపోటా, మామిడి, అంజూర, బత్తాయి మొక్కలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు ఉద్యాన పంటల సాగు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీ అందిస్తున్నారు. మండలంలో 44 మంది రైతులకు 5,600 మొక్కలు పంపిణీ చేశామని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు బషీర్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మొక్కలు అందజేస్తున్న ఏపీఓ శ్రీనివాసులు